నిందితుల లొంగుబాటు

- యువకుడిని రాళ్ల తో కొట్టిన దుండగులు
- చికిత్స పొందుతూ మృత్యువాత
- సీసీ పుటేజీల ఆధారంగా పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కిషన్

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బోనాల కిషన్

గిర్మాజీపేట, డిసెంబర్ 15: వరంగల్‌లో ఈ నెల 5న ఎకేల్లి రాకేశ్‌ను తీవ్రంగా కొట్టి అతడి మృతికి కారణమైన నిందితులను పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. శుక్రవారం ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో వారు లొంగిపోయారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ బోనాల కిషన్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 5న అర్ధరాత్రి వరంగల్ శాంతినగర్‌కు చెందిన క్యాటరింగ్ బాయ్ ఎకేల్లి రాకేశ్(23) వంట పనిపై పర్లపల్లి విజయతో కలిసి తొర్రూరు వెళ్లేందుకు వరంగల్ బస్టాండ్‌కు బయల్దేరాడు. ఈ క్రమంలో అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాల ప్రధాన గేట్ వద్దకు రాగానే గరీబ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీధర్, సదువుల బన్ని, ఇస్లావత్ ప్రవీణ్ రాకేశ్‌తోపాటు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించారు. రాకేశ్ వారిని వారించడంతో కోపోద్రిక్తులైన నిందితులు రాకేశ్‌పై రాళ్లతో తీవ్రంగా దాడి చేసి పారిపోయారు. రాకేశ్ తల వెనక భాగం, ఎడమ చెంపపై తీవ్రంగా గాయాలై అపస్మారకస్థితిలో పడిపోయాడు. గమనించిన విజయ స్థానికుల సాయంతో రాకేశ్‌ను 108 అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ రాకేశ్ ఈ నెల 12న రాత్రి 8 గంటలకు మరణించాడు. దర్యాప్తులో భాగంగా ఇంతెజార్‌గంజ్ పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. వారు సీఐ శ్రీనివాస్ ఎదుట లొంగిపోయి నేరం ఒప్పుకోగా, అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో ఎస్సై కొమురెల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ముదిరాజ్ నాయకులు

'మక్తల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి'

చెన్నారావుపేట, డిసెంబర్ 15: అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇచ్చి ముదిరాజ్‌ల రిజర్వేషన్ సమస్యలను పరిష్కరించాలని మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ కోరారు. ఉప్పరపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్లు ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, భిక్షపతి, నిమ్మరబోయిన రమేశ్, వీరస్వామి, గ్రామ ప్రధాన కార్యదర్శి పెద్ద రమేశ్, కృష్ణ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి బీఆర్ఎస్ నేతల పరామర్శ

నెక్కొండ, డిసెంబర్ 15: మడిపెల్లికి చెందిన మాజీ ఎంపీపీ తేజావత్ వాలూనాయక్ సతీమణి భాజీ శుక్రవారం మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. నెక్కొండ పీఏసీఎస్ చైర్మన్ మారం రాము, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేశ్‌యాదవ్, సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, గుండ్రపల్లి సర్పంచ్ భోంపెల్లి రాజేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటుక సోమయ్య, డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, లింగ్యానాయక్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

'మానవ హక్కుల ఉల్లంఘన జరుగొద్దు'

నర్సంపేట, డిసెంబర్ 15: మానవ హక్కుల ఉల్లంఘన జరుగకుండా చూడాలని ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మానవ హక్కుల వారోత్సవాల సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సదస్సులో ఉపాధ్యాయులు కృష్ణారావు, భిక్షపతి, బుచ్చిరాములు, రమేశ్, శైలజా, ఎం రమేశ్, శ్రీలత, రాము సేవక్ పాల్గొన్నారు.

20లోగా ఇంటి పన్ను చెల్లించాలి

ఆత్మకూరు, డిసెంబర్ 15: మండలంలోని 16 గ్రామాల్లో ఇంటి యజమానులు నల్లా, ఇంటి పన్నులను ఈ నెల 20వ తేదీలోగా చెల్లించాలని ఎంపీవో చేతన్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన పెద్దాపురంలో పన్ను వసూలు కార్యక్రమం నిర్వహించారు. ఇంటి యజమానులు బకాయిలు లేకుండా పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రజలు ఆన్‌లైన్, ఫోన్‌పే ద్వారా కూడా పన్నులు చెల్లించొచ్చని సూచించారు.

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అయ్యప్ప ఆలయంలో భక్తుల పూజలు

నర్సంపేట, డిసెంబర్ 15: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కాశీ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న అఘోరాలు అయ్యప్ప ఆలయాన్ని దర్శించారు. ఐదుగురు అఘోరాలు భక్తులకు ఆశీస్సులు అందించారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, రవీందర్, లక్ష్మీనారాయణ, చింతల కమలాకర్ పాల్గొన్నారు.

మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రర్ చేసుకోవాలి

ఖిలావరంగల్, డిసెంబర్ 15: యువతకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాలు, డిజిటల్ లెర్నింగ్, సాంకేతిక నైపుణ్య అంశాలు, కెరీర్ గైడెన్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుపరిచిన మై భారత్ పోర్టల్‌లో యువత రిజిస్ట్రర్ చేసుకోవాలని జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోర్టల్ యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. యువతీ యువకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు మొబైల్ నంబర్ ద్వారా పోర్టల్‌లో రిజిస్ట్రర్ కావాలని సూచించారు. అలాగే, ఎన్‌వైకేఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే వక్తృత్వ పోటీల ద్వారా పార్లమెంటులో ప్రసంగించే అవకాశం ఉంటుందని ఆయన తెలియజేశారు.

కొప్పుల-ములుగు బస్సు పునరుద్ధరణ

పరకాల, డిసెంబర్ 15: పరకాల నుంచి కొప్పుల మీదుగా ములుగుకు వెళ్లే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించినట్లు పరకాల డిపో మేనేజర్ రవిచందర్ శుక్రవారం తెలిపారు. చెన్నాపూర్ నుంచి కొప్పుల మార్గంలో రోడ్డు విస్తరణ పనులు ఉన్నందున బస్సును నిలిపివేశారు. ఇప్పుడు కొప్పుల, గంగిరేణిగూడెం, గోరికొత్తపల్లి మీదుగా ములుగు సర్వీసును పునఃప్రారంభించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్‌కు వందల సంఖ్యలో ఓటీపీలు

- ఖాతాల నుంచి రూ. 44 వేలు మాయం
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

శాయంపేట, డిసెంబర్ 15: మొబైల్‌కు వందల సంఖ్యలో ఓటీపీలు వచ్చి.. ఖాతాల్లోని రూ. 44 వేలు మాయమైన ఘటన పెద్దకోడెపాకలో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు రఘు బైక్‌పై హనుమకొండకు వెళ్లి తిరిగి గురువారం సాయంత్రం పెద్దకోడెపాకలోని తన ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో అతడి మొబైక్‌కు వరుసగా ఓటీపీలు వచ్చాయి. వందల సంఖ్యలో ఓటీపీలు రావడంతో ఆందోళనకు గురైన రఘు వెంటనే తన మొబైల్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. ఇంటికి చేరిన తర్వాత మొబైల్ నుంచి సిమ్ కార్డు తీసి మరో సెల్‌ఫోన్‌లో వేశాడు. అయినా ఓటీపీలు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో తన పే లేటర్ యాప్ నుంచి విడుతల వారీగా రూ. 26 వేలు, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు నుంచి రూ. 18 వేలు మాయమయ్యాయి. వెంటనే అతడు కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తన ఖాతాలు, కార్డులను బ్లాక్ చేయించాడు. తన మిగితా కార్డుల నుంచి ఎంత మొత్తం మాయమైందో తెలియదన్నారు. శుక్రవారం ఆయన శాయంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నర్సంపేట, డిసెంబర్ 15: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన నర్సంపేటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన వడ్నాల వంశీకృష్ణ(23) ఈ నెల 4న అర్ధరాత్రి కారులో వరంగల్ నుంచి నర్సంపేటకు వస్తూ పట్టణంలోని వరంగల్ రోడ్డులో ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టారు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడు ఎల్ఎల్‌బీ చేసి గత ఏడాది వృత్తిని చేపట్టాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వంశీకృష్ణ(ఫైల్)

ఊరుగొండలో ఒకరికి గాయాలు..

దామెర: ఊరుగొండ పెట్రోల్ పంపు సమీపంలో బైక్‌ను కారు ఢీకొనగా వ్యక్తి గాయడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఓగ్లాపూర్ గ్రామానికి చెందిన సిలివేరు కిషన్(50) పరకాలకు వెళ్లి తిరిగి శుక్రవారం రాత్రి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి కారు అతివేగంతో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కిషన్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో అతడిని వరంగల్‌కు తరలించారు.

తాటిచెట్టు పైనుంచి పడి..

పరకాల: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన నాగారంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు దూలం శ్రీనివాస్ శుక్రవారం తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారీ పడగా స్థానికులు దవాఖానకు తరలించారు. శ్రీనివాస్ ఎడమ చేయి విరిగింది. బాధితుడిని ఆదుకోవాలని గీత కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు.

జాతీయ ఖోఖో పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని

షీల్డులు, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న సీత, శ్రీకాంత్

చెన్నారావుపేట/సంగెం, డిసెంబర్ 15: అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బానోత్ సీత అండర్-19 జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి శుక్రవారం తెలిపారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో నేటి నుంచి 19వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. ఆలిండియా అండర్-19 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన సీత ప్రయాణ ఖర్చుల కోసం ఉపాధ్యాయులు రూ. 2 వేల నగదు అందించారు. అలాగే, చెరువుముందుతండా వాసులు రూ. 500 అందించారు. అలాగే, సంగెం మండలం ఎల్గూరురంగంపేటకు చెందిన ఇమ్మిడి శ్రీకాంత్ ఇటీవల నేపాల్‌లో జరిగిన అండర్-19 విభాగం ఖోఖోలో ప్రతిభ కనబర్చాడు. నర్సంపేటలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శ్రీకాంత్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పీఈటీ ప్రశాంత్‌కుమార్ సారథ్యంలో ఖోఖోలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో రాణించి అంతర్జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు.

నేడు 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

నెక్కొండ, డిసెంబర్ 15: నెక్కొండలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు చేపట్టనుండడంతో నెక్కొండ, పత్తిపాక, రెడ్లవాడ, అలంకానిపేట, నాగారం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో గృహ వినియోగదారులకు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంటుందని, వ్యవసాయానికి నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ సదానందం తెలిపారు. నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదని, రైతులు సహకరించాలని కోరారు.

ఎస్సైకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ శంకర్

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

దామెర, డిసెంబర్ 15: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌ను ఎంపీపీ కాగితాల శంకర్, మండల ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ దాడి మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు గరిగె కృష్ణమూర్తి, పుల్యాల రఘుపతిరెడ్డి, దండు రాజు, మిరాల రవి, రవీందర్, బీఆర్ఎస్ ఎస్సీసెల్ దామెర అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, కొడకండ్ల శ్రీను, ఆర్టీఐ నాయకులు సిలివేరు కరుణాకర్, విద్యాసాగర్, అమీర్, భాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మొగిలిచెర్ల విద్యార్థి

అనిల్

గీసుగొండ, డిసెంబర్ 15: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్ల జడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న నమిండ్ల అనిల్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ ముఖర్జీ తెలిపారు. ఈ నెల 17 నుంచి జరుగనున్న పోటీల్లో అనిల్ పాల్గొంటాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని టీచర్లు అభినందించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

శాయంపేట, డిసెంబర్ 15: మండలకేంద్రంలోని మత్స్యగిరిస్వామి ఆలయాన్ని గ్రేటర్ వరంగల్ 50 డివిజన్ కార్పొరేటర్ నెక్కొండ కవితా కిషన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సామల భిక్షపతి వారిని స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనిత

కరీమాబాద్, డిసెంబర్ 15: ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి సూచించారు. ఎస్ఆర్ఆర్‌తోటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అనిత ఆధ్వర్యంలో శుక్రవారం కరీమాబాద్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 105 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు డాక్టర్ అనిత తెలిపారు. కార్యక్రమంలో వొగిలిశెట్టి అనిల్, వంగరి సురేశ్, మరుపల్ల గౌతమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.